
# మైలు రాళ్ళు –



డాక్టర్ విశ్వం :

సాయంత్రం....

ఓ. పి. అంత రద్దీగాలేదు. చెదురు మదురుగా పేషంట్లు వచ్చి పోతున్నారు.

ఓ. పి. లో నేనొక్కణ్ణే కూర్చొని వున్నాను. నా కొలీగ్ - ఫిమేల్ మెడికల్ ఆఫీసరు లేబర్ రూమ్‌లో ఓ డెలివరీ కేసుతో కుస్తీ పడుతోంది.

సరిగ్గా అప్పుడే శారద తమ్ముడు ఓ. పి. లోకి గాలిలా దూసుకు వచ్చాడు.

"ఏమిటోయ్ అలా వచ్చావ్?" అన్నాను.

"మా అక్కయ్య మీకీ ఉత్తరం యిమ్మంది" అంటూ జేబులోంచి ఓ మడిచిన కాగితాన్ని తీసి నా చేతిలో పెట్టి మారు మాట్లాడేందుకు కూడా అవకాశం యివ్వకుండా తుర్రున పారిపోయాడు—వచ్చినంత వేగంగానూ.

ఉత్తరం ఊడదీసి చదివాను.

"డాక్టరుగారికి, నమస్కారం!

ఈ ఉత్తరం అందిన వెంటనే ఒకసారి ఇంటికి రావలసిందిగా కోరుచున్నాను. నాకు మధ్యాహ్నం నుంచి భరించరానంతగా కడుపు నొప్పి వస్తోంది. ఆస్పత్రికి వచ్చే పరిస్థితిలో లేను కనుక మిమ్మల్ని రమ్మని అర్థిస్తున్నాను. వస్తారు కదూ!

మీ రాక కోసం ఎదురు చూస్తూ

శారద"

అదీ ఉత్తరంలోని సారాంశం!

శారద నా కింతవరకెప్పుడూ ఉత్తరం రాసి ఎరుగదు. ఇదే మొదటిసారి. ఆస్పత్రికి రాలేని పరిస్థితిలో రాసి వుంటుందేమో! ఎలా వుందో ఏమో!

కుర్చీలోంచి లేచి కావలసిన ఇంజక్షన్, మాత్రలూ తీసుకుని డ్యూటీ సిస్టర్‌ని పిలిచి ఏవైనా కేసులు వస్తే కూర్చోబెట్టమనీ, నేనో పదీ పదిహేను నిమిషాల్లో వచ్చేస్తాననీ, మరీ అంత అర్జంటయితే లేడీ డాక్టర్‌ని అటెండు కమ్మనీ చెప్పి గబగబ బయటికి నడిచి స్కూటర్ స్టార్ట్ చేసి ఎక్కాను.

నేనా ఊరు వచ్చి ఒకటిన్నర సంవత్సరం అవుతోంది. నేను రాగానే మా స్టాఫ్ నాకో చిన్న ఇల్లు చూసి పెట్టారు.

నా వయసింకా ఇరవై ఆరు దాటలేదు. మెడిసిన్ పూర్తి చేసీ చెయ్యడంతోనే నా అదృష్టం కొద్ది జన్మకో శివరాత్రిలా జరుపబడే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామినేషన్స్ ఆ యేడు జరపడమూ అందులో నేను పాసుకావడమూ ఆ వెంటనే పోస్టింగు ఆర్డర్లు పడటమూ తన్నితే బూర్ల తట్టలో పడ్డట్టు కోనసీమ నడిబొడ్డులో ఉద్యోగం రావడమూ ఒకదాని తర్వాత ఒకటిగా జరిగి పోవడం వల్ల నేను బ్రహ్మచారిగానే వుండిపోయాను. అప్పట్లో ఈవిషయంమావాళ్ళంతగా పట్టించుకున్నట్లుగా లేదు.

అయితే నాకీ ఉద్యోగం వచ్చిం తర్వాత అటు మా ఇంట్లో వాళ్ళూ యిటు మా మావయ్య వాళ్ళూ కూడా నన్ను నంజుకు తింటున్నారు - పెళ్ళి చేసుకో పెళ్ళి చేసుకో అని.

అయితే యిప్పట్లో లగ్నాలు లేవనీ నా పెళ్ళి మరో ఆరు నెల్లకి వాయిదా పడిపోయింది. ఫలితంగా నాకూ, హోటల్ మీల్సుకూ ఋణానుబంధం మళ్ళీ మరో ఆరునెల్లకి పొడిగించబడింది.

అదీ బ్రీఫ్‌గా నా హిస్టరీ.

అయితే నా హిస్టరీ చెప్పిన నేను శారద హిస్టరీ కూడా కొంతవరకు చెప్పక తప్పదు.

శారద నాకు అతి విచిత్రమైన పరిస్థితుల్లో పరిచయమైంది.

ఆ రోజు నాకు ఆప్షనల్ హాలీడే. మధ్యాహ్నం ఆస్పత్రి లేదు. నిద్రపట్టక బోర్ కొట్టేస్తుంటే—మాట్నీకెళ్ళి చూసొస్తున్నాను. ఎవరో ఒకమ్మాయి నా స్కూటర్‌కి అడ్డు రావడమూ నేను సడన్‌గా బ్రేకులు నొక్కడమూ ఆ వెంటనే స్కూటర్ గిర్రున తిరిగి క్రింద పడటమూ ఆ అమ్మాయి అల్లంత దూరంలో ఎగిరి పడటమూ ఇది చూస్తున్న పదిమంది మా చుట్టూ గుమి కూడటమూ తలవని తలంపుగా నేనూహించని విధంగా జరిగిపోయాయి.

గుమికూడిన జనం తలో మాట అనటం ప్రారంభించారు.

"ఎంత స్కూటర్ వుంటే మాత్రం మనుషుల్ని చూచుకుని నడపొద్దూ."

"అయినా పిదపకాలం పిదప బుద్ధులు—భూమ్మీద నిలుస్తున్నారా ఈ కాలం కుర్రకుంకలు."

"అందులోనూ అందమైన ఆడది కనిపిస్తే చాలు. యాక్సిలరేటరు శక్తికొద్దీ తిప్పేయడమే అటు స్కూటర్‌ని కంట్రోల్ చెయ్యగలమా? లేదా? అనే ఆలోచనే లేకుండా."

"అయినా యిన్ని మాటలెందుకు? నాలుగు తగిలిస్తే బుద్ధొస్తుంది. మరోసారి ఒళ్ళు దగ్గర పెట్టుకుని మరీ నడుపుతాడు."

"చూస్తారేం తగిలించండి."

"ఊఁ....కానివ్వండి."

స్కూటర్ క్రిందపడ్డ నేను స్కూటర్ని తప్పించుకుని నెమ్మదిగా లేచి నిలబడి బట్టలకు అంటుకున్న దుమ్ము దులుపుకుంటుంటే ఓ పదిమందికి పైగానే చేతులు పైకెత్తి 'కొట్టండి చంపండి వెధవని' అంటూ నా మీదికి రావడం చూచి గజగజ వొణికిపోయాను.

చూస్తున్న జనం తలో దెబ్బా నా మీద వేస్తే!-

ఆ ఊహ రాగానే నాలో కంపరం మొదలైంది.

"భగవంతుడా! రక్షించు...." అంటూ కళ్ళు మూసుకున్నాను.

అంతే!—

"ఆగండి, ఆయనదేం తప్పులేదు, నేనే చూసుకోకుండా రోడ్డుదాటాను. నాదే పొరపాటు. ఆయన్నేం చెయ్యకండి" అంటూ నా స్కూటర్ క్రింద పడ్డ అమ్మాయి అమాంతం నాకడ్డొచ్చింది.

ఈ హఠాత్ పరిణామానికి షాక్ తిన్న ప్రజలు-ఆ షాక్ నుంచి వెంటనే కోలుకొని - 'కందకు లేని దురద కత్తిపీటకెందుకన్నట్లు మనకెందుకొచ్చిందీ పదండి పోదాం,' అంటూ గొణుక్కొంటూ ఎక్కడి జనం అక్కడ జానపద చిత్రంలోని మాంత్రికుడు మంత్రించినట్లుగా మాయమైపోయారు.

"బ్రతుకుజీవుడా" అనుకుంటూ అప్పుడు గాలిపీల్చుకున్నాను.




డా॥ టి. విమల

అప్పుడు అక్కడ ఆరోడ్డుమీద నేనూ ఆ అపరిచిత వ్యక్తి మాత్రమే మిగిలిపోయాం ఒకర్ని ఒకరు చూచుకుంటూ.

'థాంక్సండీ, నన్ను ఆర్థోపెడిక్స్ డిపార్టు మెంటుకి వెళ్ళనీకుండా రక్షించారు, అంతేకాదు, మీకు నేనెంతో రుణపడివున్నాను. మీకు నేను స్కూటర్ డాష్ యిచ్చినా మీరు నన్ను ఆదుకున్నారు'' అన్నాను ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ.

ఆమె చిన్నగా నవ్విందేగాని మారు మాట్లాడ లేదు. అలా ఐంది నాకూ శారదకు పరిచయం.

అలా మొదలైన పరిచయం ఈ ఆరునెల్ల లోనూ అభివృద్ధి చెందిందనే చెప్పాలి.

ఆ తర్వాత నేను చాలాసార్లు శారద వాళ్ళ ఇంటికి వెళ్ళటమూ శారద తల్లిదండ్రులు నన్నెంతగానో అభిమానించి ఆప్యాయంగా చూడటమూ జరిగింది. అందుక్కారణం బహుశా నేనూ శారదా వాళ్ళూ ఒకే కులానికీ – తెగకూ చెందిన వాళ్ళం కావడమే అయివుండవచ్చునని నా అభిప్రాయం.

ఆ తర్వాత నాకు చాలా విషయాలు తెలిసి వచ్చాయి.

శారదకు పదహారవ యేటనే పెండ్లి జరిగిందనీ పెండ్లి జరిగిన కొద్ది రోజులకే భర్త ఓ కారు యాక్సిడెంటులో మరణించాడనీ అప్పటినుండీ పసుపు కుంకుమలకు దూరమై మనో వ్యథ చెందుతూందనీ. శారదకు మారుమనువు చేసుకోవాలనే ఆలోచన వున్నట్లూ అందుకు ఆమె తల్లి దండ్రులు 'ససేమిరా' యిష్టపడనట్లూ అందుకే శారద ఎప్పుడూ ఆలోచిస్తూ లోలోపలే కుమిలి కుమిలి ఏడుస్తున్నట్లూ యింకా యింకా ఎన్నో విషయాలు తెలిసాయి నాకు.

అయితే శారద యిలాగే పసుపు కుంకుమలకు దూరమై అయిదోతనానికి ఆశలు వదులుకొని నిస్సారంగా భారంగా జీవితాన్ని గడపవలసిందేనా? విధవగా బ్రతికినంత కాలం అన్ని సుఖాలకు అతీతంగా బ్రతకాలా?

ఎన్నో ప్రశ్నలు నన్ను పీడించేవి.

అయినా నేను నిస్సహాయుణ్ని. శారదపై జాలి చూపించగలనేమో గాని శారద జీవితానికి దారి చూపించలేనేమో!

ఎందుకంటే నా పెళ్ళి నా మేనమామ కూతురు కమలతో ఎప్పుడో నిశ్చయమైపోయింది.

సడన్‌గా ఎవరో నా స్కూటర్‌కి అడ్డొచ్చారు.

సడన్‌గా బ్రేకులు వేశాను, ఆలోచనలకి కూడా సడన్‌గానే బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతంలోకి వచ్చి పడ్డాను.

శారదకు ఎలావుందో - ఏమిటో-

కడుపు నొప్పట! అంటే ఏ విధమైన కడుపు నొప్పి? అల్సర్ పెయినా అపెండిసైటిసా? రేక డిస్మెనూరియానా? ఏది?

తొందరగా శారదను చూడాలనే ఆలోచనతో స్కూటర్ వేగాన్ని పెంచాను. స్కూటర్ బాణంలా దూసుకుపోతోంది.

శారద :

విశ్వం అంటే నాకెంతో యిష్టం.

అసలు విశ్వాన్ని ఆరోజు యాక్సిడెంటులో యాక్సిడెంటల్‌గా చూచి నప్పుడే నాలో అలజడి బయలుదేరింది.

ఆ అలజడే రాను-రాను 'ఇష్టం'గా పరిణమించి నాకు నిద్రాహారాలు లేకుండా చేస్తోంది.

విశ్వాన్ని గురించి నేను ఆలోచించని రోజంటూ అసలు లేదు.

అయితే విశ్వం కూడా నాగురించి-నేనాలోచించి నంతగా ఆలోచిస్తుంటాడా? నా మీద విశ్వానికి ఏ విధమైన అభిప్రాయం వుంది? అది తెలుసుకోవాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను గాని వీలు పడలేదు.

అయినా – మేమిద్దరమూ మనసువిప్పి మాట్లాడుకోడానికి అదను, అవకాశం ఎప్పుడు దొరికింది గనుక! విశ్వం మా ఇంటికి ఎప్పుడొచ్చినా మా నాన్నగారూ అమ్మగారూ వుండేవారు.

పోనీ విశ్వానికి ఉత్తరం ద్వారానైనా నా అభిప్రాయాన్ని తెల్పాలనుకొనేదాన్ని. కాని ఆ వెంటనే భయం నన్నావరించేది. నేను రాసిన ఉత్తరం పొరపాటున ఎవరికైనా చిక్కితే!

అందుకే ఆ ప్రయత్నమూ విరమించుకున్నాను.

ఎప్పటికైనా ఏకాంతంగానే విశ్వాన్ని కలుసుకోవాలనీ నా మనసులోని కోరికను వ్యక్తం చెయ్యాలనీ అటువంటి అవకాశం కలిగించమనీ దేవుణ్ని ప్రార్థించేదాన్ని.

ఇంతకాలానికి భగవంతుడు నా మొరాలకించాడు.

అర్జంటుగా మా పిన్నికి వంట్లో బాగుండలేదనీ వెంటనే బయలుదేరి రమ్మనీ అర్జెంటు టెలిగ్రాం రావడమూ ఉన్నపళంగా మా నాన్న అమ్మా చెల్లీ బయలుదేరి వెళ్ళటమూ జరిగిపోయింది.

అయితే నాకు తోడు మా తమ్ముడు వుండిపోయాడు ఇంట్లో.

వాడిని ఎలా వొదిలించుకోవాలా? అని ఆలోచించి ఆఖరికి ఓ ప్లాను వేశాను. మా తమ్ముడికి సినిమాలంటే తెగపిచ్చి, అందులోనూ స్టంట్ సినిమాలంటే మరీ పడిచస్తాడు.

అందుకే వాడిని దగ్గరికి పిలిచి - బుజ్జగించి, "ఒరేయ్ తమ్ముడూ? ఈ రోజు మంచి స్టంట్ సిన్మా విడుదలైంది తెలుసా? నిన్నా సిన్మాకి పంపిస్తాగాని, నాకో సాయం చేసి పెట్టు. నేనో ఉత్తరం యిస్తాగాని దాన్ని పట్టుకుపోయి, డాక్టర్ విశ్వంగారికి యిచ్చేసి అటునుంచి అటే సిన్మాకి వెళ్ళిపో. బ్లాకులోనైనా సిన్మా చూచిరా. తెల్సిందా'' అంటూ ఓ అయిదు రూపాయల నోటూ, నేను రాసిన ఉత్తరమూ వాడికిచ్చి బయటికి పంపేశాను.

వాడు వెళ్ళి సుమారు అరగంట దాటుతోంది. ఈపరికి విశ్వం బయలుదేరే వుంటాడు. ఆతగాడు వాచ్చేసరికి నేను మంచం మీద పడుకొని లేని కడుపునొప్పి నటించాలి. అంతే!

అలా అనుకున్నానో లేదో బయట స్కూటర్ ఆగిన శబ్దం—

ఎగిరి మంచం మీద పడుకున్నాను.

కొద్దిసేపట్లో కాలింగ్ బెల్ మ్రోగింది.

అంటే! ఇంకొద్ది నిముషాల్లో విశ్వం నా ఎదురుగా వుంటాడు. తలుపులు తీసి వున్నాయ్ గనుక లోపలికి నేరుగా వచ్చేస్తాడు.

ఆ ఆలోచన రాగానే నాలో ఒక ప్రక్కన సన్నని వొణుకు, మరో ప్రక్కన ఏదో తెలియరాని మధురానుభూతి....పులకింత.

నా ఉనికిని గుర్తు చేస్తూ. "అబ్బా! అమ్మా!'' అంటూ కొంచెం పెద్దగానే మూలిగాను. అంటే — నా మూలుగు విని, విశ్వం నా గదిలోకి వస్తాడని — నా ఆలోచన.

నా ఆలోచనే నిజమైంది.

టక్...టక్...టక్ బూట్ల శబ్దం. విశ్వం నా గదిలో అడుగు పెట్టాడు.

విశ్వాన్ని చూడగానే నా ఆనందం వెల్లి విరిసింది. నా కోరికలు పురివిప్పి నాట్యం చేశాయి. అమాంతం విశ్వాన్ని చుట్టేసి కొరికిపారెయ్యాలనే వింత కోరిక నాలో కలిగింది.

కాని, మౌనం వహించాను.

విశ్వం నా దగ్గరికి వచ్చాడు. అక్కడే కొంచెం దూరంగా వున్న ఈజీచైర్‌ని నా దగ్గరికి జరుపుకొని కూర్చుంటూ, "మీ అమ్మగారు, నాన్నగారు ఇంట్లో లేరా?'' అని అడిగాడు.

"ఊహూ'' తల అడ్డంగా ఊపాను-లేరన్నట్లు.

"ఇప్పుడెలా వుంది?'' మళ్ళీ అడిగాడు.

ఎలా వుందని చెప్పను? ఏమని చెప్పను? ఎలా చెబితే అర్థం చేసుకోగలడు విశ్వం? - కోరికలు నన్ను కాల్చేస్తున్నాయ్ అని చెప్పగలనా? ఇంత కాలం ఇటువంటి అవకాశం కోసమే నిరీక్షించాననీ, ఇంతకాలానికి ఆ అవకాశం దొరికిందనీ-యీ అవకాశాన్ని జారవిడుచుకోవద్దనీ, సద్వినియోగం చేసుకోమనీ-సంఘమూ, దేవుడూ, పాపమూ - అంటూ శ్రీరంగ నీతులు చెప్పొద్దనీ అందిన అందాన్నీ కోరిన ఆడదాని పొందునూ అనుభవించమనీ — చెప్పనా? ఏమని చెప్పను? ఎలా చెప్పను? ఎలా చెబితే విశ్వం అర్థం చేసు కుంటాడు??

ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేసేస్తుంటే — ఎటూ చెప్పలేక, అబ్బా అంటూ మూలిగాను.

"ఏమిటి? ఏమైంది? నొప్పి ఎక్కువగా వస్తోందా'' కంగారుగా అడిగాడు విశ్వం తను కూర్చున్న చైర్‌ని నా దగ్గరికి జరుపుకుంటూ.

"ఊఁ'' అన్నాను. అది 'గోమో' లేక 'బాధో' తెలీని స్థితిలో.

"ఎక్కడ నొప్పి?'' అడిగాడు విశ్వం.

"ఇక్కడ'' అంటూ చేత్తో చూపించాను. పొట్టమీది చీరను ప్రక్కకు తొలిగించి.

విశ్వం నా పొట్ట మీద చెయ్యివేసి, నాల్గయిదు చోట్ల నొక్కి "ఎక్కడ ఎక్కువగా నొప్పి వుందో చెప్పు'' అని అడిగాడు.

ఎక్కడ వుందని చెప్పను. అసలు వుంటేగదా! చెప్పడానికి?

ఒక ప్రక్క నవ్వొస్తుంది. అయినా ఆపుకున్నాను.

"ఎప్పటినుండి నొప్పి?'' మళ్ళీ అడిగాడు.

"మధ్యాహ్నం నుండి'' అందమైన అబద్ధం.

"ఇంతకు ముందెప్పుడైనా వచ్చిందా?''

"లేదు.''

విశ్వం నా మీదికి వొంగి మళ్ళీ నా పొట్ట మీద కుడిచేతిని వుంచి, వ్రేళ్ళతో నొక్కుతూ పరీక్ష చెయ్యసాగాడు.

నేను మాత్రం పరీక్షగా విశ్వం ముఖంలోకే చూస్తూ వుండిపోయాను. విశ్వం నన్ను గమనించడం లేదు.

అయినా యివన్నీ డాక్టర్లకి క్రొత్తా? ఎంతో మందిని చూచి వుంటారు. అప్పుడు-అటువంటప్పుడు డాక్టర్లకేమీ అన్పించదా? జబ్బు తప్ప - ఆడదాని అందాలు కనిపించవా? ఏమో!

కాకపోతే మరేమిటి? ఒంటరిగా వున్న ఆడదాన్ని-సిగ్గువిడిచి-చీర తొలగించినా-అర్థం చేసుకోలేకపోతున్నాడేమిటి-విశ్వం?

అసలింతకీ—నా మీద విశ్వానికి-'ఆ' ఆలోచన వుందో! లేదో! నా పొందు కావాలని అతగాడికి ఎప్పుడూ అన్పించలేదా?

ఏమో!....నాకు మాత్రం విశ్వం పొందు కావాలని బలంగా అన్పిస్తోంది. చనిపోయిన నా భర్త నాలో అనుభవాలనూ-తీపి గుర్తులనూ మిగిల్చి అకస్మాత్తుగా మరణించాడు. ఇప్పుడు ఆ అనుభవాలు జ్ఞాపకం వస్తున్నాయి. మగాడి పొందు కావాలని నా శరీరం మారాం చేస్తోంది.

ఎలా!....ఎలా??—

ఏనాడూ మరే మగవాడూ నాకింత దగ్గరగా రాలేదు.

భర్తపోయిన తర్వాత తారసపడిన మొదటి మగవాడు విశ్వం. అదీగాక విశ్వంతో పరిచయం పెంచుకోవడానికి అవకాశాలు లభించాయి.

అందుకే విశ్వం మీద ఆశలు పెంచుకున్నాను.

ఆ ఆశలు నెరవేర్చుకోడానికే ఈరోజు పిలిపించాను.

నాకు తెల్సు నేను చేస్తున్నది తప్పని. అయినా తప్పదు. ఈ రోజు ఎలాగైనా నా అందచందాలతో చేష్టలతో విశ్వాన్ని కవ్వించి మత్తెక్కించి మైమరపించి నావాడిగా చేసుకోవాలి. రేపు నేనేమైపోయినా పర్వాలేదు.

ఇదీ నా ఆలోచన.

కాని విశ్వం అందుకు అంగీకరిస్తాడా?

ఏమో!

"ఇక్కడ నొప్పిగా వుందా?'' అంటూ విశ్వం నా బొడ్డుకింద చెయ్యి వుంచి వ్రేళ్ళతో నొక్కాడు. నాకు నొప్పి అనిపించలేదు గాని చక్కలిగిలి అనిపించింది. ఏదో తెలీని మైకం నన్నావరించింది. పిచ్చిదాన్నై పోయాను.

అంతే!—

నా మీదికి వొంగి నన్ను పరీక్ష చేస్తున్న విశ్వాన్ని అమాంతం రెండు చేతులతోనూ చుట్టేసి నా మీదికి లాక్కొని అతగాడి ముఖాన్ని ముద్దులతో ముంచేశాను.

ఈ హఠాత్ పరిణామాన్ని ఊహించని విశ్వం క్షణకాలం నివ్వెరపోయి తర్వాత ఆ షాక్ నుండి

తేరుకుని నా నుండి దూరంగా జరగాలని ప్రయత్నించాడు. నా కౌగిలినుండి తప్పించుకోవాలని చూశాడు.

కాని అది ముందుగానే వూహించిన నేను నా కౌగిలి మరింతగా బిగించాను. విశ్వాన్ని కదలనివ్వలేదు.

"శారదా" పెద్దగా అరిచాడు విశ్వం.

అయినా నేను వినలేదు.

"ప్లీజ్ విశ్వం! ప్లీజ్!....నా కోరిక తీర్చు. కాలిపోతున్న నా శరీరాన్ని చల్లార్చు" అంటూ మత్తుగా గొణిగాను.

'ఇక లాభంలేదు' అనుకున్నాడేమో లాగి చెళ్ళున నా చెంప పగులగొట్టాడు విశ్వం. నా కళ్ళు గిర్రున తిరిగాయి. అంతే! నా కౌగిలి సడలింది. సడలిన నా చేతుల్లోంచి తప్పించుకొని విశ్వం అమాంతం మంచం మీది నుండి ఎగిరి క్రిందికి దూకాడు.

నేను ఓడిపోయాను.

నా కోరిక తీరలేదన్న ఆలోచన నాలో చోటు చేసుకోగానే నాలో దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది.

భోరున ఏడ్చాను.

అలా ఎంతసేపు ఉండిపోయానో తెలీదు.

పరాంకుశం:

నేను శారద తండ్రిని. సనాతనుడ్ని, ఛాందసుడ్ని.

కుటుంబ గౌరవం కోసం మర్యాద కోసం— వంశగౌరవ ప్రతిష్ఠల కోసం ప్రాణం పెట్టేవాడ్ని. అటువంటి వంశంలోనే పుట్టాను నేను.

ఓసారి మా తాతగారి కొడుకు — దొంగ చాటుగా ఏదో వీధి నాటకానికి వెళ్ళొచ్చాడని తెలుసుకుని వాడ్ని ఇంట్లోంచి గెంటించాడుట మా తాతగారు. అటువంటి వంశంలోంచి వచ్చాన్నేను.

నాకు అయిదుగురు సంతానం. పెద్దవాళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాను. మూడవది శారద. దాని పెళ్ళీ చేశాను గాని దాని రాత బాగోలేదు. ఇంకా చిన్నవాళ్ళిద్దరున్నారు. ఒక కొడుకూ ఒక కూతురూ.

ఆ రోజు మా మరదలికి వంట్లో బాగుండలేదని ఉదయమే టెలిగ్రాం రావడంతో నేనూ, నా ఆడదీ, ఆఖరు పిల్లా ఉన్నపళంగా బయలుదేరి వూరెళ్ళాం.

అయితే టెలిగ్రాం యివ్వాల్సినంత సీరియస్గా లేదక్కడి పరిస్థితి. అందుకే నా భార్యనీ, కూతుర్నీ అక్కడే వొదిలేసి ఇంటి దగ్గర శారద, పిల్లాడు వొంటరిగా వుంటారని నేను తిరుగు ప్రయాణం కట్టాను.

నేను ఊళ్లో దిగి ఇల్లు చేరుకునేసరికి ఇల్లు నిర్మానుష్యంగా వుంది. శారద ఏమైంది? నా పిల్లవాడు—వాడసలే అల్లరిగాడు ఏమయ్యాడు?

బావి దగ్గర కాళ్ళు కడుక్కుని లోపలికి వెళ్ళేసరికి శారద పడకగదిలోంచి ఎవరివో మాటలు వినిపించి తక్కున ఆగిపోయాను.

ఆ మాటల్ని తొందరగానే పోల్చుకోగలిగాను. ఒకరు శారద; మరొకరు డాక్టర్ విశ్వం.

అయితే డాక్టర్ విశ్వం యిప్పుడెందుకొచ్చాడు? ఒకవేళ వచ్చినా శారద పడకగదిలోకి వెళ్ళవలసిన అవసరం ఏమొచ్చింది? కొంపదీసి....

నాలో ఏదో అనుమానం తొంగి చూసింది.

నా కాళ్ళు అనాలోచితంగా ఆ గదివరకు నడిచి అక్కడ ఆగిపోయాయి మంత్రించినట్లుగా. అది తప్పో, ఒప్పో నాకు తెలీదు గాని నా చెవులు దొంగ చాటుగా వాళ్ళిద్దరి మాటల్ని రికార్డు చెయ్యడం ప్రారంభించాయి.

"శారదా! ఎంతకు తెగించావమ్మా!....నువ్వు చేసిన పని ఎంత నీచమైనదో ఆలోచించావా?" అది విశ్వం గొంతు.

"అవును. అన్నీ బాగా ఆలోచించే నేనీ నిర్ణయానికొచ్చాను." అది శారద గొంతు.

"ఏమిటీ! అన్నీ ఆలోచించుకునే ఈ నిర్ణయం తీసుకున్నావా? క్షణికమైన సుఖం కోసం తుచ్ఛమైన శారీరకానందం కోసం నీ నిండు నూరేళ్ళ జీవితాన్ని పణంగా పెట్టాలని చూస్తావా? ఇదేనా వివేకం?" విశ్వం గొంతు.

శారద సమాధానం ఏం చెబుతుందోననే ఆతురత నాలో బయలుదేరింది. ఒకటి రెండు నిమిషాలు దొర్లాయి.

దీర్ఘంగా ఒక నిట్టూర్పు వినిపించింది. అది శారద నిట్టూర్పు. ఆ తర్వాత శారద గొంతు వినిపించింది. "ఏం చెయ్యమంటారు చెప్పండి విశ్వంగారూ! నేనూ అందరిలాంటి ఆడదాన్నే. నేనూ ఉప్పు కారం తింటున్నాను. నాకూ కోరికలుంటాయి. నా భర్త చనిపోయాడు. భర్తతోపాటు నా కోరికలూ చచ్చిపోయి వున్నట్లయితే నా కిప్పుడీ నరకమూ, బాధా, వ్యథా వుండేవి కావు. కాని—నా కోరికలు సమాధికాలేదు. వయసు పొంగులతో పాటు అవీ పెరిగాయి. నాకూ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనీ అందరిలా నేనూ పసుపు కుంకుమలతో సుమంగళిగా నూరేళ్ళూ బ్రతకాలనీ యింకా ఎన్నో ఎన్నో కోరికలున్నాయి. కాని మా ఇంట్లోవాళ్ళు అందుకు ససేమిరా ఒప్పుకోనంటున్నారు. వయసులో వున్న నాకు కోరికల్ని చన్నీళ్ళు పోసుకుని చల్లార్చుకోమని సలహాలిస్తున్నారు. కాని ఎదిగిన పిల్ల అందులోనూ మొగుడితో కొంతకాలం కాపురం చేసిన పిల్ల కళ్ళముందు తిరుగుతున్నదనే విచక్షణా జ్ఞానం కూడా లేకుండా నా తల్లీ, తండ్రీ నా ముందే ఈ ముసలి వయసులో కూడా సరసాలాడుకుంటారు. రాత్రుళ్ళు ఒకే మంచం మీద ఒకర్నొకరు కౌగలించుకుని మరీ పడుకుంటారు. ఇది సమంజసమేనా చెప్పండి. అటువంటివి చూచినప్పుడు నా శరీరం నూనెలో వేయించినట్లు వుడికిపోతుంది. నాలో కోరికలు రెచ్చిపోతుంటే, రెచ్చగొడుతుంటే ఏం చెయ్యమంటారు చెప్పండి? నా కోరికలు చన్నీళ్ళ స్నానానికి లొంగుతాయంటారా? చెప్పండి విశ్వంగారూ! చెప్పండి. లేదు....లేదు... నా కోరికలు ఎలా తీరతాయో నాకు తెలుసు. అందుకే ఈ నిర్ణయాని కొచ్చాను. మా వాళ్ళు నా కెటూ పెళ్ళి చెయ్యరు. కనీసం తాత్కాలికంగానైనా నా కోరికలు చల్లార్చుకోడానికి ఈ పద్ధతి అవలంబించాను."

శారదేనా అలా మాట్లాడుతోంది. అమ్మా! శారదా! ఎంతకు తెగించావు తల్లీ! క్షణికమైన ఆనందం కోసం, సుఖం కోసం పవిత్రమైన శీలాన్ని కోల్పోతావా? శీలం పోయిన ఆడదాని విలువ ఎటువంటిదో ఆలోచించావా తల్లీ! నీ వన్నట్లు తప్పు నీదికాదు నాది. ఈ వయసులో కూడా నా సుఖం నేను చూసుకుంటున్నానే గాని నీ సుఖం గురించి ఎప్పుడూ సీరియస్గా ఆలోచించలేదు తల్లీ! తప్పే తల్లీ తప్పు నాది! నా తప్పు తెలుసుకున్నాను. నన్ను క్షమించు శారదా! క్షమించు.

నా మనసు మౌనంగా దుఃఖిస్తోంది.

ఎంత పొరపాటుగా ఆలోచించావు శారదా! నీ మార్గానికి నీ తల్లిదండ్రులు అడ్డు వస్తున్నప్పుడు ఆ మార్గాన్ని సులభతరం చేసుకోవాలి. లేదంటే ఆ మార్గంలో నిలబడి సనాతన సాంప్రదాయాలు, గోంగూర అంటూ తీరులు వల్లించే నీ తల్లిదండ్రుల్ని ఎదిరించి నీ మార్గాన్ని నువ్వే ఏర్పరచుకోవాలి. నీకు నచ్చిన వాడ్ని నిన్నిష్టపడిన వాడ్ని

ఎన్నుకొని నీ జీవితాన్ని నువ్వే నందనవనం చేసుకోవాలి. అంతేగాని పిచ్చిపిచ్చి ఆలోచనలతో క్షణిక మైన ఉద్రేకాలకు లోనై నీ జీవితాన్ని నువ్వే నీ చేతులారా నాశనం చేసుకుంటావా? చెప్పు శారదా! చెప్పు.

"నేను మగవాణ్ని. అందులోనూ వయసులో వున్నవాణ్ని. అంతమాత్రం చేత నువ్వొంటరిగా వున్నావనీ నన్ను కోరుకున్నావనీ, నిన్ను పొంది నీ శీలాన్ని అపహరించి నీ కోరిక తీర్చి నాకోరిక తీర్చుకున్నానే అనుకో. దాని పర్యవసానం ఎలా వుంటుంది? ఒకసారి కళ్ళు మూసుకొని మనసు స్థిమితం చేసుకొని ఆలోచించు. అప్పుడు తెలుస్తుంది శారదా! నీ పరిస్థితిలోనే నా చెల్లి వుంటే ఎలా వుంటుంది? ఆమె పరిస్థితి ఎటువంటిది? ఆమె జీవితం ఏం కావాలి? శీలం పోతుంది. ఎంతో మంది డాక్టర్లకి చూపించుకొని ఎన్నో దేవుళ్ళకి మొక్కుకున్నా కడుపులు పండని ఈ రోజుల్లో ఇటువంటి అక్రమమైన కలయిక ఒక్కటి చాలు. కడుపు పండటానికి జీవితాన్ని నాశనం చెయ్యటానికి.

"నీ కడుపు పండితే ఏమవుతుందో ఆలోచించు. అటు లోకానికి యిటు నీ తల్లిదండ్రులకూ నీ ముఖాన్ని చూపించలేక ఏ నుయ్యో గొయ్యో చూచుకుంటావు. అంతేనా? ఆత్మహత్య చేసుకుని ఎవర్ని సాధించాలని? ఆలోచించు. నీకు పెళ్ళి చేయడం వల్ల కళంకమైపోతుంది అని మీ తల్లిదండ్రులు అనుకొంటున్న వంశ గౌరవం అప్పుడేమవుతుంది? తరుగుతుందా? పెరుగుతుందా? అందుకేనమ్మా శారదా! ఇంతగా చెబుతున్నది నేను. ఇటువంటి ఆలోచనలు విరమించుకొని నీకు నచ్చినవాణ్ని నీ తల్లిదండ్రులు యిష్టపడకపోయినా ఏ గుళ్ళోనో ఏ రిజిస్టరాఫీసులోనో పదిమంది పెద్దల సమక్షంలో పెళ్ళిచేసుకో నీ జీవితాన్ని సుఖమయం చేసుకో. అంతేగాని నీ బాగోగులు గమనించని నీ తల్లిదండ్రుల కోసం నువ్వెందుకమ్మా అక్రమ మార్గం అవలంబించడం? నీ శీలాన్ని పణంగా పెట్టడం? శీలం చెడిన ఆడదాని విలువ ఈ సమాజంలో ఎలాంటిదో ఒక్కసారి ఆలోచించు" అంది విశ్వం గొంతు.

ఎంత బాగా చెప్పావయ్యా విశ్వం!

నేనింత కాలం ఈ విషయాలేమీ సీరియస్‌గా ఆలోచించలేదు. నీవు మంచివాడివి, యోగ్యుడవి కనుక అంది వచ్చిన నా కూతుర్ని అనుభవించకుండా అవతలికి నెట్టావు. లేకపోతే ఏమయ్యేది? ఈ అక్రమ సంబంధం యిలాగే కొంతకాలం సాగేది. ఫలానా వాడి కూతురు ఫలానా వాడితో తిరుగుతోంది అని లోకం కోడై కూసేది. కొంత కాలానికి నా కూతురికి కడుపొచ్చేది. ఆ అవమానాన్ని భరించలేక శారద ఏ నుయ్యో గొయ్యో చూచుకొని ఆత్మహత్య చేసుకొనేది. అప్పుడు ఫలానావాడి కూతురు కడుపు తెచ్చుకొని చచ్చిపోయింది అని నానా మాటలూ అనేది ఈ లోకం. దానికి పెళ్ళి చేయకపోవటం వల్లనే అది అలా చేసిందనీ దాని చావుకి పరోక్షంగా కారణం నేనేననీ లోకం నన్ను తప్పు పట్టేది. అప్పుడు నా వంశం గౌరవం మట్టి మశానం ఏమయ్యేవి? అంతా బూడిదలో పోసిన పన్నీరయ్యేవి.

అందుకే బాబూ! విశ్వం! యింత కాలానికైనా నా కళ్ళు తెరిపించావు. నా తప్పు తెలుసుకున్నాను.

ఈ లోకంలో నీలాంటి సహృదయులు యింకా ఎంతో మంది వున్నారు, వాళ్ళల్లో ఏ ఒక్కడైనా ముందుకి రాకుండా పోడు. నా కూతుర్ని పెళ్ళి చేసుకోకుండా పోడు. ఈ లోకం గొడ్డుపోలేదు. ఈ రోజునుంచే నేనా ప్రయత్నంలో వుంటాను. ఇంత మేలు చేసిన నీకు నేనెంతో ఋణపడి వున్నాను విశ్వం! ఎంతో ఋణపడి వున్నాను. నిజంగా నీ ఋణం తీర్చుకోలేనిది.

"చెప్పు శారదా! చెప్పు! ఈ తొందరపాటు పని ముందు జీవితంలో మరెప్పుడూ చెయ్యననీ అడ్డుదార్లు త్రొక్కననీ దాని మార్గంలోనే పయనిస్తాననీ చెప్పు శారదా. నా మీద ఒట్టేసి మరీ చెప్పు" విశ్వం.

"నిజంగా విశ్వంగారూ! నేనేనాడూ తొందరపాటుపని చెయ్యను. నా తల్లిదండ్రులను ఎదిరించి అయినాసరే నా మార్గాన్ని నేనే ఏర్పరచుకుంటాను. నా మాట నమ్మండి" ఒట్టేసి నట్లుంది శారద.

అమ్మా శారదా? నువ్వింక నన్నెదిరించవలసిన అవసరం లేదు తల్లీ! బూజు పట్టిన ఈ సనాతన సమాజాన్ని ఎదిరించి నిలబడే గుండె ధైర్యం, మనో నిగ్రహం నాకే వచ్చాయి. నేనే ఎదిరిస్తాను. ఇంత కాలం అంధకారంలో బ్రతికిన నాకు విశ్వం వెలుగుబాట చూపించాడు. ఆ బాటలోనే నడుస్తాను తల్లీ! నడుస్తాను. నీ కోరిక తీరుస్తాను.

రచయిత్రి :

మనిషి తప్పు చేస్తాడు. అది మానవ సహజం. అయితే చేసిన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపపడి ఆ తప్పుని మరోసారి చెయ్యకుండా వుండగలిగితే ఆ మనిషి మహనీయుడే అవుతాడు,

వంశ మర్యాద మట్టి మశానం అంటూ పాత చింతకాయ పచ్చడిలాంటి భావాలను పట్టుకొని పాకులాడిన వరాంకుశానికి తన కళ్ళముందే తన కూతురు, రగిలే కోరికల్ని చల్లార్చుకోడానికి శీలాన్ని సైతం పణంగా పెట్టడం చూశాక ఒక్కసారిగా గొప్ప నిజం బయటపడింది. జ్ఞానోదయం కలిగింది. ముసలి వయసులో వున్న తనూ తన భార్యా శారీరకమైన కోరికల్ని తీర్చుకుంటున్నారే గాని, వయసులో వున్న శారద కోరికలకు బానిసే అనే నగ్నసత్యాన్ని గుర్తించలేకపోయాడు వరాంకుశం యింతకాలం.

ఇంతకాలానికైనా ఆ విషయం తెలుసుకోడం నిజంగా మార్పే మరి!

ఎటూ తన తల్లిదండ్రులు తనకు పెళ్ళి చెయ్యరనీ ఈ జీవితంలో తనకు పెళ్ళి జరిగే యోగం లేదనీ ఊహించిన శారద, తొందర పెడుతున్న కోరికల్ని చల్లార్చుకోడానికి అడ్డదారులు అవలంబించాలని చూసిందేగాని - క్షణికోద్రేకాలు ఎటువంటి దారుణ పరిణామాలకు దారి తీస్తాయో - యింతకాలం ఊహించలేకపోయింది. విశ్వం హితవులతో తల తిరిగి-నిజాన్ని తెలుసుకుంది. అడ్డదారులు మాని, తన జీవితాన్ని తను నందనవనం చేసుకోవాలనీ, తన మార్గంలో ఎటువంటి అడ్డంకులున్నా ఎదిరించి నిలిచి తన కార్యాన్ని సాధించుకోవాలనీ నిర్ణయించుకుంది.

అటువంటి నిర్ణయం నిజంగా హర్షించదగినదే గదా మరి!!

అందుబాటులో వున్న అందాలనీ - అనుభవాలనీ కాలదన్ని, కోరి వచ్చిన ఆడదానిలో తన సోదరిని చూసుకొని, చెడుత్రోవలో నడవటానికి ప్రయత్నించిన శారదకు-తన మాటలతో చేతలతో పరివర్తన కలిగించి, ఆమెను సరైన మార్గంలో నడిపించడం, దారి చూపించడం నిజంగా విశ్వం యొక్క విశాల హృదయానికీ, విజ్ఞతకీ, అభ్యుదయ భావాలకీ గీటు రాయి.

ప్రతి మనిషి జీవితంలో జనించే ప్రతి మంచి ఆలోచనా ఒక మైలురాయి క్రిందే లెక్క!

అటువంటి ఎన్నో మైలు రాళ్ళు — ప్రగతికీ పురోభివృద్ధికీ మైలు రాళ్ళు. □